సాక్షి రంగారెడ్డి
గురువారం । 16 । అక్టోబర్ । 2025



ఇంకా తేలని రుణాల లెక్క!
డ్వాక్రా సంఘాల నిధుల గోల్‌మాల్ విషయంలో రుణాల లెక్క ఇంకా తేలడం లేదు. విచారణ కొనసాగుతోంది. 10లో▸



శాంతిభద్రతల పరిరక్షణ..
శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయమని రాజేంద్రనగర్ డీసీపీ యోగేష్ గౌతమ్ అన్నారు. బుధవారం నాకాబందీ చేపట్టారు. 10లో▸



ఎమ్మెల్యేను కలిసిన..
రైతు బజార్‌కు సరైన స్థలం కేటాయించకపోవడంతో గిరాకీ రావడం లేదని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేశారు. 10లో▸

న్యూస్‌రీల్

సిటిజన్ సర్వేలో పాల్గొనాలి

తుక్కుగూడ: రానున్న రోజుల్లో రాష్ట్రాన్ని అభివృద్ధి, సంక్షేమ రంగాల్లో అగ్రగామిగా నిలిపిందుకు ప్రభుత్వం తెలంగాణ రైజింగ్ విజన్-2047 అంశాలతో డాక్యుమెంట్‌ను రూపొందిస్తోందని కలెక్టర్ సి.నారాయణరెడ్డి అన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం ఆయన మాట్లాడుతూ.. ఈనెల 10న ప్రారంభమైన సిటిజన్ సర్వే ఈనెల 25 వరకు కొనసాగుతుందని తెలిపారు. సర్వేలో ప్రతి ఉద్యోగి పాల్గొన్ని తమ విలువైన సలహాలు, సూచనలు అందించాలని సూచించారు. సర్వే లింకును, క్యూఆర్ కోడ్‌ను తమ కార్యాలయంలో ప్రదర్శించి, విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు.

రేపు జాబ్ మేళా

ఇబ్రహీంపట్నం: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రాధిక బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 18 నుంచి 35 ఏళ్ల లోపు 10వ తరగతి, ఆపై విద్యార్హత కలిగిన వారు హాజరు కావొచ్చని తెలిపారు. హెడీబీ ఫైనాన్షియల్ సర్వీసెస్, ఏ నాన్-ఐటీ కంపెనీ, ఏ మాన్యూఫాక్చరింగ్, మెడ్‌ప్లస్ తదితర కంపెనీలు నియామకాలు చేపడతాయని చెప్పారు. ఆసక్తి గల యువతీయువకులు తమ విద్యార్హత, ఆధార్, ఎక్స్‌పీరియన్స్ తదితర ధ్రువపత్రాలతో హాజరుకావాలని సూచించారు.

పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆమనగల్లు: పంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని పంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు గ్యార పాండు డిమాండ్ చేశారు. పంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర మహాసభలు ఈనెల 24,25 తేదీల్లో మహబూబాబాద్ జిల్లా గార్లమండల కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆమనగల్లులోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం స్థానిక నాయకులతో కలిసి మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడంలో పంచాయతీ కార్మికుల పాత్ర వెలకట్టలేనిదని అన్నారు. వారి సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి రాకముందు అనేక హామీలు ఇచ్చిందని గుర్తుచేశారు. వాటిని అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ ఏరియా కన్వీనర్ పెంటయ్య, యూనియన్ జిల్లా ఉపాధ్యక్షురాలు కవిత, జిల్లా సహాయ కార్యదర్శి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ జిల్లా అధ్యక్ష పదవికి దరఖాస్తు



చల్లా నర్సింహారెడ్డి దరఖాస్తు సమర్పిస్తున్న హన్మానాయక్

కడ్తాల్: కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్ష పదవి కోసం గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మానాయక్ దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు బుధవారం ప్రస్తుత అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డిని కలిసి దరఖాస్తు సమర్పించారు. ఈ సందర్భంగా హన్మానాయక్ మాట్లాడుతూ.. నలభై ఏళ్లుగా పార్టీలో వివిధ విభాగాల్లో పనిచేస్తూ, సేవలందించినట్టు తెలిపారు. తన అభ్యర్థనను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు.

చేవెళ్ల ఆర్డీఓకు పదోన్నతి



చేవెళ్ల: చేవెళ్ల ఆర్డీఓ కె.చంద్రకళకు స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి లభించింది. బుధవారం ప్రభుత్వం విడుదల చేసిన 13 మంది ఆర్డీఓల పదోన్నతుల జాబితాలో చంద్రకళ కూడా ఉన్నారు. విషయం తెలియడంతో స్థానిక నాయకులు, అధికారులు ఆమెకు అభినందనలు తెలిపారు. ప్రస్తుతానికి ఆర్డీఓలకు పదోన్నతి లభించినా పోస్టింగ్‌లు మాత్రం ఇవ్వలేదు. ఖాళీలను బట్టి పోస్టింగ్‌లు ఉంటాయని, అప్పటి వరకు వారి స్థానాల్లోనే పదోన్నతి గ్రేడ్‌తోనే కొనసాగనున్నట్లు సమాచారం.

గుట్టుగా రిజిస్ట్రేషన్లు!

పాత వెంచర్లలోని ఖాళీ స్థలాలపై కబ్జాదారుల కన్ను

- పూర్వాపరాలు పరిశీలించకుండానే ఇష్టారీతిన రిజిస్ట్రేషన్లు
- రేణుకాపూర్ విలేజీలో 40 ఫీట్ల రోడ్డుకు..
- సాహెబ్‌నగర్‌లో ఐదు వేల గజాల ఖాళీ స్థలానికి..
- ఎస్‌ఆర్‌ఓలను 'మేనేజ్' చేస్తున్న అక్రమార్కులు
- కోర్టులు, మంత్రుల చుట్టూ స్థానికుల ప్రదక్షిణలు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: జిల్లాలో 22 సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులు ఉన్నాయి. వీటిలో ప్రతి నెలా సగటున 22 వేల డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ అవుతున్నాయి. స్టాంప్‌డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజుల రూపంలో ప్రభుత్వానికి నెలకు సగటున రూ.360 కోట్లకుపైగా ఆదాయం సమకూరుతోంది. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపానికి తోడు తప్పు చేసిన వాళ్లపై ఇప్పటి వరకు చర్యలు తీసుకోకపోవడంతో క్షేత్రస్థాయిలోని కొంత మంది ఎస్‌ఆర్‌ఓలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఎలాంటి వివాదాలకు ఆస్కారం లేకుండా పూర్తి పారదర్శకంగా ఆస్తుల రిజిస్ట్రేషన్లు చేయాల్సింది పోయి కబ్జారాయుళ్లతో కలిసి పాత లే అవుట్లలో ప్రజావసరాల కోసం కేటాయించిన ఖాళీ స్థలాలకు రిజిస్ట్రేషన్లు చేసేస్తున్నారు. అడిగినంత ఇస్తే చాలు భూ స్వభావం, సర్వే నంబర్లు, లే అవుట్‌కు అనుమతులు, లింకు డాక్యుమెంట్లను కూడా పరిశీలించడం లేదనే విమర్శలు ఉన్నాయి. అబ్దుల్లాపూర్‌మెట్, ఇబ్రహీంపట్నం, ఎల్బీనగర్, శంషాబాద్, రాజేంద్రనగర్, మొయినాబాద్, శంకర్‌పల్లి, గండిపేట, శేరిలింగంపల్లి ఎస్‌ఆర్‌ఓల పరిధిలో తరచూ అక్రమాలు వెలుగు చూస్తున్నాయి. పాత స్టాంప్ పేపర్లను సేకరించి గుట్టుగా రిజిస్ట్రేషన్లు చేస్తున్నారు. విలువైన స్థలాల అన్యాక్రాంతానికి కారణమవుతున్నారు.



సాహెబ్‌నగర్‌లో కబ్జాపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి ఫిర్యాదు చేస్తున్న స్థానికులు

గుట్టుగా ఎల్‌ఆర్‌ఎస్ చేయించి..

ప్రభుత్వం పాత వెంచర్లలోని ఖాళీ స్థలాలకు కల్పించిన ఎల్‌ఆర్‌ఎస్ వెసులుబాటును కొంత మంది రియల్టర్లు అవకాశంగా మలుచుకుంటున్నారు. లే అవుట్ వేసిన సమయంలో పార్కులు, పాఠశాలలు, ఆస్పత్రులు, క్రీడా ప్రాంగణాలు, కమ్యూనిటీ కేంద్రాల పేరుతో వదిలిన ఖాళీ స్థలాలకు గుట్టుగా ఎల్‌ఆర్‌ఎస్ చేయించి, తర్వాత సబ్ రిజిస్ట్రార్లకు ముడుపులు ముట్టజెప్పి విలువైన స్థలాలను తమ పేరున రిజిస్ట్రేషన్ చేసుకుంటున్నారు. రిజిస్ట్రేషన్‌కు ముందే రెవెన్యూ రికార్డుల్లోని సర్వే నంబర్లు, భూ స్వభావం సహా లింకు డాక్యుమెంట్లు పరిశీలించి, ఎలాంటి వివాదాలు లేవని నిర్ధారించిన తర్వాతే ఆయా స్థలాలకు రిజిస్ట్రేషన్లు చేయాల్సి ఉంది. కానీ కొంత మంది సబ్ రిజిస్ట్రార్లు ఇవేవీ పట్టించుకోకుండా గుడ్డిగా ఆయా స్థలాలకు రిజిస్ట్రేషన్లు చేస్తూ డాక్యుమెంట్లు జారీ చేస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. పిగ్లిపూర్ రెవెన్యూ సర్వే నంబర్ 12/పీలో వెలసిన లే అవుట్‌లో ప్రైమరీ స్కూలు, పార్కుల కోసం కేటాయించిన 0.88 సెంట్ల భూమిని అబ్దుల్లాపూర్‌మెట్ ఎస్‌ఆర్‌ఓ ఓ ప్రైవేటు వ్యక్తుల పేరున రిజిస్ట్రేషన్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. రిజిస్ట్రేషన్స్ అండ్ స్టాంప్స్‌శాఖ ఐజీకి కొంత మంది ఫిర్యాదు సైతం చేశారు. సేల్‌డీడ్‌లను రద్దు చేయాలని కోరినా ఇప్పటి వరకు చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. అక్రమార్కులపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోకపోవడంతో బాధితులు కోర్టులను ఆశ్రయిస్తున్నారు.

బడంగ్‌పేట్ మున్సిపల్ పరిధిలోని రేణుకాపూర్ విలేజ్ సర్వే నంబర్ 354/4లో అమెరికన్ టౌన్‌షిప్ పేరుతో ఏళ్ల క్రితమే లే అవుట్ చేశారు. ప్రజావసరాల కోసం 500 గజాల విలువైన స్థలాన్ని వదిలారు. స్థానికంగా ఉన్న ఓ వ్యక్తి పార్కుస్థలం సహా అటువైపు వెళ్లే 40 ఫీట్ల రోడ్డును కబ్జా చేశారు. అప్పటికే అనేక అభ్యంతరాలు ఉన్న ఆ భూమికి చంపాపేట్ సబ్ రిజిస్ట్రార్ ఏకంగా రిజిస్ట్రేషన్ చేశారు. డాక్యుమెంట్ నంబర్లు 5425/2025, 5426/2025 కూడా జారీ చేశారు. ఇదే అంశంపై అమెరికన్ టౌన్‌షిప్ ప్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు ఇప్పటికే హైకోర్టును ఆశ్రయించారు. విషయం తెలిసీ సంబంధిత ఎస్‌ఆర్‌ఓపై ఇప్పటి వరకు చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

హయత్‌నగర్ మండలం సాహెబ్‌నగర్ రెవెన్యూ సర్వే నంబర్ 200లో 1967లోనే శ్రీపురంకాలనీ ఏర్పాటు చేశారు. పార్కు సహా ఇతర ప్రజావసరాల కోసం ఐదువేల గజాల ఖాళీ స్థలాన్ని కేటాయించారు. ఛత్రపతి శివాజీ పార్కు పేరుతో ఇప్పటికే ఆ స్థలానికి నామకరణం చేసి, జీహెచ్‌ఎంసీ నిధులతో అభివృద్ధి పనులు చేపట్టారు. విలువైన ఈ ఖాళీ స్థలంపై స్థానికంగా ఉన్న కొంత మంది కన్నుపడింది. వనస్థలిపురం ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్‌తో కుమ్మక్కై స్థలాన్ని తమ పేరున రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఇందుకు సహకరించిన ఎస్‌ఆర్‌ఓకు భారీగా ముట్టజెప్పినట్లు తెలిసింది. ఈ అంశంపై ఇటీవల కొంత మంది స్థానికులు రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని కలిసి ఫిర్యాదు చేశారు.

ట్రిపుల్‌ఆర్ అలైన్‌మెంట్ మార్చొద్దు



భూ నిర్వాసితులకు మద్దతు తెలుపుతున్న నాయకులు

షాద్‌నగర్‌రూరల్: రీజినల్ రింగ్‌రోడ్డు (ట్రిపుల్ ఆర్)ను పాత అలైన్‌మెంట్ ప్రకారమే నిర్మించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య డిమాండ్ చేశారు. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం ఎదురుగా బుధవారం పార్టీ డివిజన్ కార్యదర్శివర్గ సభ్యుడు శ్రీనునాయక్ ఆధ్వర్యంలో ట్రిపుల్‌ఆర్ భూ నిర్వాసితులు రిలే దీక్షలు చేపట్టారు. దీక్షలకు మద్దతు తెలిపిన యాదయ్య మాట్లాడుతూ.. వందల ఎకరాల భూస్వాముల భూముల్లో కాకుండా పేద, చిన్న, సన్నకారు రైతుల భూములను ఆక్రమిస్తూ రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణం చేపట్టడం దారుణమని విమర్శించారు. పేద రైతుల భూములు లాక్కుంటే అడిగేవారు ఉండరనే ఆలోచనతో రేవంత్‌రెడ్డి సర్కార్ ట్రిపుల్‌ఆర్ అలైన్‌మెంట్‌ను మార్చిందని ఆరోపించారు. సీపీఎం డివిజన్ కార్యదర్శి రాజు మాట్లాడుతూ.. ప్రభుత్వ నిర్ణయంతో అనేక మంది పేద రైతులు తమ విలువైన భూములను కోల్పోతారని ఆవేదన వ్యక్తం చేశారు. వారికి అన్యాయం చేయాలని చూస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో భూ నిర్వాసితులు పూజారి లక్ష్మయ్య, రమేష్, చంద్రకాంత్, నగేష్, సుదర్శన్‌రెడ్డి, శ్రీకాంత్, మహ్మద్‌బాబు, కుర్మయ్య, ఈశ్వర్, రాజు, బొజ్జ నాయక్, రాజేష్, లక్ష్మణ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

గాలికుంటును నివారిద్దాం



కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ గోపి తదితరులు

రాష్ట్ర పశు సంవర్ధక శాఖ సంచాలకుడు డాక్టర్ గోపి

మంచాల: గాలికుంటు వ్యాధి నివారణే లక్ష్యంగా పని చేయాలని రాష్ట్ర పశు సంవర్ధక శాఖ సంచాలకుడు డాక్టర్ బి.గోపి అన్నారు. మండలంలోని జాపాలలో బుధవారం నిర్వహించిన పశువులకు గాలి కుంటు టీకాల వాక్సినేషన్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈ వ్యాధి కారణంగా పాడి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. ప్రమాదకరమైన వ్యాధిని పూర్తిగా నిర్మూలించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. జిల్లా వ్యాప్తంగా 92 పశు వైద్య బృందాలు వచ్చే నెల 14వ తేదీ వరకు టీకాలు వేయడం జరుగుతుందన్నారు. పాడి రైతులు పశువులకు తప్పక టీకాలు వేయించాలని సూచించారు. అనంతరం పాడి రైతులకు కాల్షియం, ఖనిజ లవణాల డబ్బాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా పశు సంవర్ధక సంయుక్త సంచాలకుడు డాక్టర్ మధుసూదన్, సహ సంచాలకులు వసంత కుమారి, పశు వైద్యాధికారులు పాల్గొన్నారు.

జాగ్రత్తలు పాటించాలి

కొత్తూరు: పశువుల ఆరోగ్యం పట్ల రైతులు జాగ్రత్తలు పాటించాలని పశుసంవర్ధక శాఖ జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ సుభాష్ సూచించారు. మండలంలోని ఎస్‌బీపల్లి, ఇన్ముల్‌నర్వ, కొత్తూరు పట్టణంలో బుధవారం నిర్వహించిన పశువైద్య శిబిరాలను ఆయన తనిఖీ చేశారు. ఇందులో భాగంగా పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. అనంతరం పశువులకు వచ్చే సీజనల్ వ్యాధుల వ్యాప్తి, నివారణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి స్ఫూర్తి, కౌన్సిలర్ సోమ్లునాయక్ పాల్గొన్నారు.

'ఫ్యూచర్'కు భూములిచ్చి సహకరించండి

కందుకూరు: ఫ్యూచర్ సిటీకి భూములు ఇచ్చి సహకరించాలని ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి కోరారు. మండల పరిధిలోని తిమ్మాయిపల్లి రెవెన్యూ సర్వే నంబర్ 9లోని 400 ఎకరాల అసైన్డ్, ప్రభుత్వ భూమిని ఫ్యూచర్‌సిటీలో భాగంగా సేకరించడానికి బుధవారం టీజీఐఐసీ అధికారులతో కలిసి మండల పరిషత్ సమావేశ హాల్‌లో రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎకరాకు చట్ట ప్రకారం కాకుండా అదనంగా రూ.55 లక్షల చొప్పున చెల్లిస్తామని, భూములు ఇవ్వాలని అన్నారు. దీంతో పాటు భూమిలో చెట్లు, నిర్మాణాలు, బోర్లు ఉంటే అదనంగా అందుతుందన్నారు. రైతులు మాత్రం తమకు ఎకరాకు రూ.2 కోట్లు చొప్పున ఇవ్వాలని డిమాండ్ చేశారు.



కందుకూరులో రైతులతో మాట్లాడుతున్న ఆర్డీఓ

విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని చెప్పి సమావేశాన్ని ముగించారు. కార్యక్రమంలో టీజీఐఐసీ జోనల్ మేనేజర్ శ్రవణ్‌కుమార్, నాయబ్ తహసీల్దార్ శేఖర్, ఆర్‌ఐ యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాభిప్రాయం మేరకే భూసేకరణ చేయాలి



తహసీల్దార్ అయ్యప్పకు వినతిపత్రం ఇస్తున్న రైతులు

యాచారం: ప్రజాభిప్రాయం మేరకే భూసేకరణ చేపట్టాలని రైతులు పేర్కొన్నారు. మొండిగౌరెల్లిలోని 19,68,127 సర్వేనంబర్లలో 820 ఎకరాల అసైన్డ్, ప్రభుత్వ భూమి సేకరణపై బుధవారం యాచారం తహసీల్దార్ కార్యాలయంలో ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంత్‌రెడ్డితో రైతులు సమావేశం కావాల్సి ఉంది. ఆర్డీఓ కోర్టుకు వెళ్లడంతో రాలేకపోయారు. దీంతో పెద్ద సంఖ్యలో వచ్చిన రైతులు తహసీల్దార్ అయ్యప్పకు వినతిపత్రం అందజేశారు. ఏళ్లుగా పంటలు పండించుకుని జీవనోపాధి పొందుతున్నామని, అలాంటి భూములను తీసుకుంటే ఉపాధి కోల్పోతామని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామసభ ఏర్పాటు చేసి మెజార్టీ రైతుల అభిప్రాయం మేరకే సేకరణ చేపట్టాలని, లేని పక్షంలో ఆందోళన తప్పదన్నారు.

రౌడీ షీటర్‌కు నగర బహిష్కరణ నోటీసులు



నవీన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: ఆదిబట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో హత్యాయత్నం, దాడులు, బెదిరింపులు, అల్లర్లకు పాల్పడుతూ శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్న ఓ రౌడీ షీటర్‌కు ఆరు నెలల పాటు నగర బహిష్కరణ విధిస్తున్నట్లు సీఐ రవికుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పలు క్రిమినల్ కేసులతో పాటు నేర చరిత్ర కలిగిన కొడుదుల నవీన్‌రెడ్డి(32) ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాడని, ఇతనిపై సాక్ష్యం చెప్పేందుకు, పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు జనం భయపడుతున్నారని పేర్కొన్నారు. హైదరాబాద్ సిటీ పోలీస్ యాక్ట్ ప్రకారం, రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు ఆదేశాల మేరకు నవీన్‌రెడ్డికి నగర బహిష్కరణ నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. నోటీసులు అందుకున్న వారం రోజుల్లోపు సమాధానం చెప్పాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

విద్యార్థులు సైబర్ చిక్కుల్లో పడొద్దు

మహేశ్వరం జోన్ డీసీపీ సునీతారెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రస్తుతం సైబర్ మోసాలు ఎక్కువయ్యాయని, వాటికి చిక్కకుండా విద్యార్థులు జాగ్రత్తగా ఉండాలని మహేశ్వరం జోన్ డీసీపీ సునీతారెడ్డి అన్నారు. ఆదిబట్ల మున్సిపల్ పరిధి మంగళ్‌పల్లి సమీపంలోని సీవీఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం ఆమె విద్యార్థులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నిత్యం ఏదో ఒక చోట సైబర్ మోసాలు జరుగుతున్నాయని తెలిపారు. పెరుగుతున్న సాంకేతిక అభివృద్ధిని మోసగాళ్లు ఉపయోగించుకుంటున్నట్లు తెలిపారు. లోన్ యాప్ పేరుతో చాలామంది ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ముఖ్యంగా విద్యార్థులు బానిసలుగా మారి డబ్బులు తిరిగి చెల్లించలేక ప్రాణాలు తీసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వ్యక్తిగత సమాచారాన్ని ఇతరులతో పంచుకోవద్దని సూచించారు. మాదక ద్రవ్యాల జోలికి పోకుండా, వాటి నివారణ కోసం కృషి చేద్దామని పిలుపునిచ్చారు. శాంతి భద్రతల పరిరక్షణ కోసం నిరంతరం పోలీసులు అండగా ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో ఏసీపీలు జానకీరెడ్డి, కేపీపీ రాజు, ఇబ్రహీంపట్నం సీఐ మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న మహేశ్వరం జోన్ డీసీపీ సునీతారెడ్డి

పండగపూటా తప్పని పస్తులు



పంచాయతీరాజ్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

- పంచాయతీ కార్మికుల వేతనాలు చెల్లించాలి
- ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహారెడ్డి

షాద్‌నగర్: పంచాయతీ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు టంగుటూరి నర్సింహారెడ్డి డిమాండ్ చేశారు. ఈమేరకు బుధవారం నగరంలో పంచాయతీరాజ్ కమిషనర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం మూడు నెలలుగా పంచాయతీ కార్మికులకు వేతనాలు చెల్లించడం లేదని అన్నారు. రెక్కాడితే కాని డొక్కాడని కార్మికులు వేతనాలు రాకపోవడంతో పండగ పూట కూడా పస్తులుండాల్సిన పరిస్థితి నెలకొందని ఆందోళన వ్యక్తం చేశారు. ఒకటో పీఆర్సీలో నిర్ణయించిన బేసిక్ వేతనం రూ.19,500 ఇవ్వాలని, వేతనాల కోసం ప్రత్యేకంగా బడ్జెట్ కేటాయించి ట్రెజరీ ద్వారా చెల్లించాలని, మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేసి పాత విధానాన్ని కొనసాగించాలన్నారు. విధి నిర్వహణలో ప్రమాదవశాత్తు మరణించిన కార్మికులకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, 8గంటల పని దినాన్ని అమలు చేస్తూ వారాంతం సెలవులు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాంచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇక మిగిలింది మూడు రోజులే!

ఉమ్మడి జిల్లాలో 514 మద్యం షాపులకు..3,173 దరఖాస్తులే..

ఎక్సైజ్ జిల్లా వారీగా మంగళవారం నాటికి వచ్చిన దరఖాస్తులు ఇలా..

ఎక్సైజ్ జిల్లా	లిక్కర్ షాపులు	2023-25	2025-27
సరూర్‌నగర్	138	10,994	622
శంషాబాద్	111	10,621	1090
మేడ్చల్	118	7,519	693
మల్కాజ్‌గిరి	88	6,722	650
వికారాబాద్	59	2,637	118

- లిక్కర్ షాపుల టెండర్లకు స్పందన అంతంతే..
- ఆశించిన స్థాయిలో ముందుకు రాని వ్యాపారులు

సాక్షి, రంగారెడ్డి జిల్లా: లిక్కర్ షాపులకు టెండర్ దరఖాస్తుల గడువు మరో మూడు రోజుల్లో ముగియనుంది. ఒకవైపు గడువు సమీపిస్తుండటం.. మరో వైపు ఆశించిన స్థాయిలో వ్యాపారులు ముందుకు రాకపోవడంతో అబ్కారీ శాఖలో ఆందోళన మొదలైంది. 2023-25 సంవత్సరంలో 495 మద్యం షాపులకు నిర్వహించిన టెండర్లలో ఉమ్మడి జిల్లా నుంచి 38,493 దరఖాస్తులు వచ్చాయి. ఒక్కో దరఖాస్తుకు రూ.2 లక్షల చొప్పున ప్రభుత్వానికి అప్పట్లో రూ.769.86 కోట్ల ఆదాయం సమకూరింది. ప్రస్తుతం దరఖాస్తు (ఫీజు రూ.3 లక్షలకు పెంచింది)లతో పాటు ఆదాయం కూడా మరింత పెరుగుతుందని ఆశించింది. కానీ ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న ఆర్థిక మాంద్యానికి తోడు..రియల్ ఎస్టేట్ పడిపోవడం.. స్థానిక సంస్థల ఎన్నికల గడువు సమీపించడం.. ఆశావహులు తమ వద్ద ఉన్న డబ్బులను ఖర్చు చేసేందుకు వెనుకాడుతుండటం.. మద్యం దరఖాస్తులపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ప్రస్తుతం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 514 షాపులకు టెండర్లు ఆహ్వానించగా, ఇప్పటి వరకు 31,73 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. కేవలం దరఖాస్తుల ద్వారానే రూ.వెయ్యి కోట్లకుపైగా ఆదాయం సమకూరుతుందని భావించినప్పటికీ ఇప్పటి వరకు రూ.వంద కోట్లు కూడా దాటకపోవడాన్ని ఎక్సైజ్ శాఖ జీర్ణించుకోలేక పోతోంది. వ్యాపారులను ఎలాగైనా ఒప్పించి, రప్పించాలని ప్రభుత్వం ఎక్సైజ్‌శాఖ అధికారులపై ఒత్తిడి తెస్తోంది. టార్గెట్‌ను చేదించేందుకు పలువురు ఎక్సైజ్ అధికారులు తమకు తెలిసిన వ్యాపారులకు ఫోన్లు చేసి, టెండర్ వేసుకోవాల్సిందిగా అభ్యర్థిస్తున్నారని తెలిసింది. ఇదిలా ఉంటే నిర్వహణ ఖర్చులు పెరగడం, గుడ్‌విల్ పేరుతో ప్రతినెలా అధికారులకు పెద్ద మొత్తంలో ముడుపులు చెల్లించాల్సి వస్తుండటం కూడా ఔత్సాహికులు ముందుకు రాకపోవడానికి మరో కారణమని తెలిసింది. ఇదిలా ఉంటే, మెజార్టీ వ్యాపారులు వారం, తిథి, ముహూర్తం చూసుకుని టెండర్లు దాఖలు చేస్తుంటారని, ఆఖరి రోజుల్లో దరఖాస్తుల సంఖ్య అనూహ్యంగా పెరగనుందని శంషాబాద్ ఎక్సైజ్ జిల్లా సూపరింటిండెంట్ ఎస్.కృష్ణప్రియా స్పష్టం చేశారు.



స్కాలర్‌షిప్ నిధులు విడుదల చేయాలి



ఏఓ రాజశేఖర్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు, విద్యార్థులు

ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో విద్యార్థుల ఆందోళన

చేవెళ్ల: ప్రభుత్వం సకాలంలో విద్యార్థులకు చెల్లించాల్సిన స్కాలర్‌షిప్‌లు, ఫీజురీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయకపోవటంతో విద్యార్థులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని ఎస్‌ఎఫ్‌ఐ డివిజన్ సహాయ కార్యదర్శి చరణ్‌గౌడ్ అన్నారు. పట్టణ కేంద్రంలో బుధవారం ఎస్‌ఎఫ్‌ఐ డివిజన్ కమిటీ సభ్యుడు చందు ఆధ్వర్యంలో కళాశాల విద్యార్థులతో కలిసి ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టి ఏఓ రాజశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పెండింగ్ బకాయిలను మొత్తం చెల్లిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత స్పందించటం లేదన్నారు. విద్యార్థుల జీవితాలతో ప్రభుత్వం ఆడుకుంటోందని మండిపడ్డారు. వెంటనే ప్రభుత్వం స్పందించి పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజురీయింబర్స్‌మెంట్ నిధులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే సీఎం క్యాంపు కార్యాలయం ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు యశ్వంత్, ఇర్మాణ్, శ్రీశైలం, మనీ, విష్ణు, రిషి, వేణు, శివ, విద్యార్థులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల డిమాండ్లు తీర్చాలి



సమావేశంలో పాల్గొన్న నాయకులు

తుర్కయంజాల్: మున్సిపల్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనం రూ.26వేల పెంచాలని తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షుడు పాలడుగు భాస్కర్ అన్నారు. పురపాలక సంఘం పరిధి రాగన్నగూడ ఎస్ఎస్ఆర్ నగర్‌లోని చలసాని కల్యాణ మండపంలో నిర్వహిస్తున్న రాష్ట్ర 5వ మహాసభల్లో భాగంగా బుధవారం రెండోరోజు ప్రతినిధుల సభ ప్రారంభానికి ముందు సీనియర్ కార్మికురాలు దుర్గమ్మ జెండా ఆవిష్కరణ చేశారు. మూడేళ్ల కాలంలో యూనియన్ నిర్వహించిన పోరాటాలను సమీక్షించుకుని, భవిష్యత్తు పోరాటాలకు తీర్మానాలు చేశారు. ఈ సందర్భంగా పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ.. కార్మికులకు ఇందిరమ్మ ఇళ్లు, ఇంటి స్థలాలు కేటాయించాలని, సహజంగా మరణించిన, అనారోగ్యంతో మరణించిన, 60ఏళ్లు పై బడిన కార్మికుల స్థానంలో వారి కుటుంబ సభ్యులకు అవకాశం కల్పించాలని కోరారు. అనంతరం యూనియన్ రాష్ట్ర కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా పాలడుగు భాస్కర్, ప్రధాన కార్యదర్శిగా జనగం రాజమల్లు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పాలడుగు సుధాకర్, కోశాధికారిగా అశోక్‌తో పాటు 29 మందిని ఆఫీస్ బేరర్స్‌గా, 130 మందిని సభ్యులుగా ఎన్నుకున్నారు.

అండర్-14 కబడ్డీలో రాష్ట్రస్థాయికి ఎంపిక



హరీశ్‌గౌడ్

కందుకూరు: మండల పరిధిలోని కటికపల్లికి చెందిన హరీశ్‌గౌడ్ అండర్-14 కబడ్డీలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. హరీశ్‌గౌడ్ కందుకూరులోని శ్రీచైతన్య స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్నాడు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో బుధవారం సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన అండర్-14 కబడ్డీ పోటీల్లో ప్రతిభ కనబర్చడంతో రాష్ట్ర స్థాయికి ఎంపిక చేశారు. ఈ నెల 16 నుంచి 18వ తేదీ వరకు సంగారెడ్డిలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణ డిసెంబర్ 4కు వాయిదా

సిటీ కోర్టులు : రాష్ట్రంలో సంచలనంగా మారిన ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణ బుధవారం నాంపల్లి కోర్టులో జరిగింది. నాంపల్లిలోని 14 అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టులో జరిగిన ఈ కేసు విచారణకు ఇప్పటికే బెయిల్ పై బయటికి వచ్చిన ఆరుగురు (ప్రభాకర్‌రావు , ప్రణీత్‌రావు, భుజంగరావు, తిరుపతన్న, రాధాకిషన్, శ్రవణ్‌కుమార్) నిందితులు కోర్టుకు వ్యక్తిగతంగా హాజరయ్యారు. ఈ కేసులో పోలీసులు సప్లిమెంటరీ చార్జిషీట్ దాఖలు చేయాల్సి ఉంది. ఈ విచారణలో జడ్జి సెలవులో వెళ్లడంతో తదుపరి విచారణ డిసెంబర్ 4కు వాయదా పడింది. నాగార్జున పరువునష్టం కేసు 30కి వాయిదా మంత్రి కొండా సురేఖపై సినీ నటుడు నాగార్జున దాఖలు చేసిన పరువునష్టం కేసు విచారణ బుధవారం నాంపల్లిలోని ప్రజాప్రతినిధుల కోర్టు (స్పెషల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్)లో జరిగింది. ఈ విచారణకు పిటిషనర్ నాగార్జున, ప్రతివాది కొండా సురేఖ గైర్హాజరయ్యారు. దీంతో వారి తరుపునా న్యాయవాదులు పిటిషన్లను దాఖలు చేశారు. మంత్రి కొండా సురేఖను క్రాస్ఎగ్జామినేషన్ చేయాల్సి ఉండగా ఆమె గైర్హాజరు కావడంతో విచారణను కోర్టు ఈనెల 30కి వాయిదా వేసింది.

ఇంకా తేలని రుణాల లెక్క!

డ్వాక్రా సంఘాల నిధుల గోల్‌మాల్
- కొనసాగుతున్న అధికారుల విచారణ
- తాజాగా ఏపీఎం, సీసీపై సస్పెన్షన్ వేటు



చౌదర్‌పల్లిలో వివరాలు సేకరిస్తున్న యాచారం ఎస్‌బీఐ, ఐకేపీ అధికారుల బృందం (ఫైల్)

యాచారం: డ్వాక్రా సంఘాల నిధుల గోల్‌మాల్ విషయంలో అప్పటి ఐకేపీ ఏపీఎం సుదర్శన్‌రెడ్డి, చౌదర్‌పల్లి సీసీ జంగయ్యపై సస్పెన్షన్ వేటు వేస్తూ డీఆర్‌డీఓ శ్రీలత ఉత్తర్వులు జారీ చేశారు. చౌదర్‌పల్లి వీకేబీ (విలేజ్ బుక్ కీపర్) వరలక్ష్మి పర్యవేక్షణలో 25 గ్రామ స్వయం సహాయక సంఘాల్లో రూ.లక్షలాది నిధుల పక్కదారి పట్టాయంటూ రెండు నెలల క్రితం మహిళలు ఆందోళనకు దిగారు. రుణాలు తీసుకోనప్పటికీ యాచారం ఎస్‌బీఐ ఖాతాల్లో అప్పులను గుర్తించిన మహిళలు సాగర్‌రోడ్డుపై ఉన్న బ్యాంకు ఎదుట బైఠాయించి ఆందోళనకు చేపట్టారు. స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, కలెక్టర్ నారాయణరెడ్డి, డీఆర్‌డీఓ శ్రీలతకు ఫోన్‌లో ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టిన డీఆర్‌డీఓ ఉన్నతాధికారులు నిధుల గోల్‌మాల్ జరిగిందని నిర్ధారించారు. 25 స్వయం సహాయక సంఘాల్లో రూ.10 లక్షల నుంచి రూ.15లక్షల అప్పులున్నట్లు రికార్డుల్లో నమోదైంది.

రికార్డుల్లో లేని రూ.3 కోట్ల రుణాలు

చౌదర్‌పల్లిలో 40కి పైగా స్వయం సహాయం సంఘాలకు యాచారం ఎస్‌బీఐ నుంచి రూ.7 కోట్ల రుణాలు ఇచ్చినట్లు రికార్డులు ఉన్నాయి. నిధుల స్వాహా వెలుగులోకి రావడంతో విచారణ చేపట్టగా మొత్తం రూ.7 కోట్లకు గాను రూ.4 కోట్ల రుణాలకు సంబంధించి మాత్రమే రికార్డులున్నట్లు గుర్తించారు. రూ.3 కోట్లకు లెక్కలు లేకపోవడంతో డీఆర్‌డీఓ ఉన్నతాధికారులు బ్యాంకు సిబ్బంది పాత్రపై ఎస్‌బీఐ ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేశారు.

ఉన్నతాధికారులకు కలెక్టర్ లేఖ

చౌదర్‌పల్లి, మల్కీజ్‌గూడ స్వయం సహాయక సంఘాల నిధుల గోల్‌మాల్‌కు సంబంధించి అప్పటి ఎస్‌బీఐ మేనేజర్ ఝాన్సీరాణి పాత్రే కీలకమని, ఆమెను విధుల నుంచి తొలగించి విచారణ చేపట్టాలని.. నిధులను రికవరీ చేయాలని కలెక్టర్ నారాయణరెడ్డి ఎస్‌బీఐ ఉన్నతాధికారులకు లేఖ రాశారు. ఎస్‌బీఐ మేనేజర్ మల్కీజ్‌గూడ, చౌదర్‌పల్లి గ్రామాల్లోని వీబీకేల ద్వారా బ్యాంకు నుంచి సంఘాల్లో లేని మహిళల పేర్ల మీద రూ.లక్షలాది నిధులను బదిలీ చేశారు. తర్వాత వ్యక్తిగత అవసరాలకు వాడుకున్నట్లు అధికారులు గుర్తించారు. వారం రోజులుగా మల్కీజ్‌గూడ, చౌదర్‌పల్లి గ్రామాల్లో యాచారం ఎస్‌బీఐ, ఐకేపీ అధికారుల బృందం కలిసి మహిళలతో సమావేశమై విచారణ చేపడుతున్నారు. తాజాగా రెండు గ్రామాల్లో రూ.10 నుంచి రూ.20 లక్షల్లోపు రికవరీ చేసినట్లు తెలుస్తోంది.

విచారణ కొనసాగుతోంది



అప్పటి యాచారం ఎస్‌బీఐ మేనేజర్ సహకారంతోనే రూ.లక్షలాది నిధులు గోల్‌మాల్ అయ్యాయి. చౌదర్‌పల్లి, మల్కీజ్‌గూడ స్వయం సహాయక సంఘాల్లో బ్యాంకు మేనేజర్ చేతివాటం ఉంది. ఆమెను విధుల నుంచి తొలగించి నిధులు రికవరీ చేయాలని కలెక్టర్ నారాయణరెడ్డి ఎస్‌బీఐ ఉన్నతాధికారులకు లేఖ రాశారు. ఇంత జరుగుతున్నా పర్యవేక్షించని ఏపీఎం సుదర్శన్‌రెడ్డి, సీసీ జంగయ్యను సస్పెండ్ చేశాం. విచారణ కొనసాగుతోంది.

– శ్రీలత, డీఆర్‌డీఓ

నాణ్యమైన విత్తనాలతోనే అధిక దిగుబడులు



వీర్లపల్లిలో పంట పొలాలను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

వ్యవసాయ విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ డాక్టర్ సౌజన్య

నందిగామ: నాణ్యమైన విత్తనాలు నాటితేనే రైతులకు అధిక దిగుబడులు వస్తాయని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయ సమాచార, ప్రసార కేంద్రం ప్రొఫెసర్ డాక్టర్ సౌజన్య అన్నారు. మండల పరిధిలోని వీర్లపల్లి, అంతిరెడ్డిగూడ, ఈదులపల్లి తదితర గ్రామాల్లో బుధవారం పలువురు వ్యవసాయాధికారులతో కలిసి ఆమె పర్యటించి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా కేఎన్ఎం-1638 రకానికి చెందిన విత్తనాలు నాటిన రైతుల పంట పొలాలను పరిశీలించి పంట ఎదుగుదల, రైతుల అనుభవాలు, పంట ఆరోగ్యం తదితర విషయాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. రైతులు తాము నాటిన పంటల విషయంలో ఏమైనా సందేహాలు ఉన్నట్లయితే వెంటనే వ్యవసాయాధికారులను సంప్రదించాలని సూచించారు. ఎల్లప్పుడూ నాణ్యమైన విత్తనాలనే నాటాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి రామశివరాం, ఏఈఓలు శిరీష, రవీందర్, రవి, ఆయా గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయం



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

మొయినాబాద్ రూరల్: శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయమని రాజేంద్రనగర్ డీసీపీ యోగేష్ గౌతమ్ అన్నారు. మొయినాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని తోల్‌కట్ట గేట్, మొయినాబాద్ ఎక్స్ రోడ్, హిమాయత్ నగర్ చౌరస్తా, అజీజ్ నగర్ చౌరస్తా, గండిపేట్ చౌరస్తా, వీరన్నపేట్‌లో బుధవారం రాత్రి నాకాబందీ నిర్వహించారు. వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అనుమానాస్పద వ్యక్తులను విచారించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేరాల నియంత్రణలో పోలీసులకు సహకరించాలని కోరారు. తనిఖీల్లో ఇద్దరు ఏసీపీలు, ఆరుగురు ఇన్‌స్పెక్టర్లు, 12 మంది ఎస్ఐలు, 65 మంది సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన చిరువ్యాపారులు



చేవెళ్ల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద ఎమ్మెల్యేతో మాట్లాడుతున్న చిరువ్యాపారులు

దుకాణ స్థలాలకు నంబర్లు కేటాయించాలని వినతి

చేవెళ్ల: రైతు బజార్‌కు సరైన స్థలం కేటాయించకపోవడంతో గిరాకీ రావడం లేదని పలువురు వ్యాపారులు ఆవేదన వ్యక్తంచేశారు. ఈ విషయాన్ని బుధవారం ఎమ్మెల్యే కాలె యాదయ్య దృష్టికి తీసుకెళ్లారు. క్యాంపు కార్యాలయంలో ఆయనను కలిసి గోడు వెల్లబోసుకున్నారు. రోడ్డు పక్కన ఉన్న ఎండోమెంట్ ఖాళీ స్థలంలో కొనసాగుతున్న దుకాణాలను తొలగించాలని ఆ శాఖ అధికారులు ఆదేశించారన్నారు. మార్కెట్ కమిటీ అధికారులు స్పందించి దుకాణ స్థలాలకు నంబర్లు కేటాయించాలని కోరారు. లేదంటే వ్యాపారుల మధ్య గొడవలు జరిగే అవకాశం ఉందన్నారు. ఈ విషయమై ఎమ్మెల్యే స్పందిస్తూ సమస్యను పరిష్కరించాలని స్థానిక ప్రజాప్రతినిధులైన మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటయ్యగౌడ్, వైస్ చైర్మన్ బి.రాములు, పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, నాయకులు ఆగిరెడ్డి, శ్రీనివాస్ తదితరులకు సూచించారు. దీంతో వారు వెళ్లి దేవాదాయ శాఖ అధికారులతో మాట్లాడటంతో సమస్య సద్దుమణిగింది.

శ్రీశైలం ఆలయ బోర్డు సభ్యుడికి సన్మానం



కాశీనాథ్‌ను సన్మానిస్తున్న నాయకులు

షాద్‌నగర్: శ్రీశైలం ఆలయ బోర్డు సభ్యుడిగా నియామకం కావడం తన పూర్వజన్మ సుకృతమని చిలివేరి కాశీనాథ్ అన్నారు. ఫరూఖ్‌నగర్‌లోని శ్రీవేంకటేశ్వరాలయంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్థానిక పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బక్కని నర్సింలు, నాయకులు కోట జనార్దన్, దాస కృష్ణయ్య, ఒగ్గు కిషోర్, చిన్న బాల్‌రాజ్, బాస రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

డీసీఎం బోల్తా : డ్రైవర్, క్లీనర్‌కు గాయాలు



బోల్తా పడిన డీసీఎం

కేశంపేట: కోళ్ల దాణా తీసుకెళ్తున్న డీసీఎం బోల్తా పడిన ఘటన మండల పరిధిలోని సంతాపూర్ గ్రామ శివారులో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. చేగుంట గ్రామ నుంచి బుధవారం సంతాపూర్‌కు కోళ్ల దాణా డీసీఎంలో తీసుకొస్తున్నారు. సంతాపూర్ శివారుకు రాగానే బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్, క్లీనర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు సహాయక చర్యలు చేపట్టారు.

శభాష్ శివకుమార్

బస్సు కింద పడ్డ వ్యక్తిని కాపాడిన ట్రాఫిక్ కానిస్టేబుల్

సుభాష్‌నగర్: బస్సు రూపంలో మృత్యు ఒడిలోకి వెళ్తున్న ఓ వాహనదారుడిని రెప్పపాటులో ట్రాఫిక్ పోలీస్ కాపాడిన ఘటన సూరారం చౌరస్తాలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే బుధవారం ఉదయం బాలానగర్ నుండి మెదక్ వైపు ఆర్టీసీ బస్సు వెళుతోంది. ఈ క్రమంలో బస్సు పక్క నుండి ఓ ద్విచక్ర వాహనదారుడు వెళ్తుండగా ఒక్కసారిగా బస్సు కింద మధ్యలో పడిపోయాడు. అక్కడే విధులు నిర్వహిస్తున్న జీడిమెట్ల ట్రాఫిక్ మార్షల్ కట్టబోయిన శివకుమార్ క్షణాల్లో పరిగెత్తి అతన్ని బస్సు కింద నుండి లాగడంతో సదరు వ్యక్తి ప్రాణాలతో బయటపడ్డాడు. క్షణం ఆలస్యం అయితే బస్సు వెనుక చక్రాలు ద్విచక్ర వాహనదారుడు పైనుంచి వెళ్లేవి. ఇదంతా క్షణాల్లో జరిగిపోయింది. అతనిని కాపాడిన దృశ్యాలు పక్కనే ఉన్న షాప్ సీసీ కెమెరాలో రికార్డు అయ్యాయి. అ దృశ్యాలు స్థానికంగా వాట్సాప్ గ్రూపుల్లో చక్కర్లు కొట్టడంతో వందలాదిమంది శివకుమార్‌ను పలువురు ప్రశంసిస్తున్నారు.

రిమాండ్‌కు లైంగిక దాడి కేసు నిందితుడు

సైదాబాద్: బాలుడిపై లైంగిక దాడి కేసులో నిందితుడిని సైదాబాద్ పోలీసులు రిమాండ్‌కు తరలించారు. సైదాబాద్ జైల్‌గార్డెన్‌లోని ప్రభుత్వ బాలల సదనంలో ఒక బాలుడిపై స్టాఫ్‌గార్డ్‌గా విధులు నిర్వహించిన ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి రహమాన్ లైంగిక దాడి చేసిన సంగతి విదితమే. బాధిత బాలుడి తల్లి ఫిర్యాదు మేరకు సైదాబాద్ పోలీసులు నిందితుడు రహమాన్‌పై పోక్సో, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ సెక్షన్ల కింద కేసు నమోదు చేసారు. బుధవారం అతడిని సైదాబాద్ పోలీసులు రిమాండ్‌కు తరలించారు.

ఏటీఎం కార్డు మార్చేసి.. రూ.40 వేలు డ్రా!

మొయినాబాద్ రూరల్: ఓ మహిళను ఏమార్చి ఏటీఎం కార్డు మార్చేసిన దుండగులు రూ.40 వేలు డ్రా చేసుకున్నారు. సీఐ పవన్‌కుమార్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మొయినాబాద్‌కు చెందిన రమాదేవి గత మంగళవారం ఉదయం చేవెళ్ల బస్టాప్‌లోని ఎస్‌బీఐ ఏటీఎం మిషన్ ద్వారా రూ.40 వేల నగదు తన ఖాతాలో జమ చేసింది. ఫోన్‌కు మెస్సేజ్ రాకపోవడంతో మధ్యాహ్నం 2గంటలకు ఏటీఎం వద్దకు వెళ్లి మినీ స్టేట్‌మెంట్ తీసుకుంది. ఆవెంటనే అక్కడే ఉన్న నలుగురు వ్యక్తులు ఆమెను ఏమార్చి మిషన్‌లో తన కార్డుకు బదులు మరో కార్డు పెట్టారు. కొద్ది సేపటి తర్వాత తన ఖాతా నుంచి రూ.40 వేలు విత్‌డ్రా చేసినట్లు మెసేజ్ రావడంతో ఆందోళనకు గురైన రమాదేవి బ్యాంకు వెళ్లగా నగదు తీసినట్లు చెప్పారు. దీంతో వెంటనే ఖాతాను క్లోజ్ చేయించి, పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తిపై దాడి

కేపీహెచ్‌బీకాలనీ: ఇంటిముందు ద్విచక్ర వాహనం పార్కు చేయొద్దని చెప్పినందుకు ఓ వ్యక్తిపై దాడి చేశారు. ఈ సంఘటన కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. కేపీహెచ్‌బీ కాలనీ 5వ రోడ్డులో నివాసం ఉండే నరసింహనాయుడు ఇంటి పక్కనే శివా బాయ్స్ హాస్టల్ ఉంది. అయితే ప్రతి రోజూ హాస్టల్ యువకులు తమ ఇంటి ఎదుట ద్విచక్ర వాహనాలు పార్కు చేసి ఇబ్బందులకు గురి చేస్తున్నారు. దీంతో ఎన్నిసార్లు చెప్పినా వినకుండా ఇంటి ఎదుట బండి పార్కు చేస్తున్నారనే కోపంతో సీట్ కవర్‌ను కట్ చేశారు. దీంతో మంగళవారం రాత్రి ప్రదీప్, వంశీలతోపాటు మరికొందరు యువకులు తమ బండి సీట్ కవర్ కట్ చేయడాన్ని ప్రశ్నిస్తూ నరసింహనాయుడుపై దాడి చేశారు. ఇరువర్గాలకు చెందిన వారు పరస్పరం దాడి చేసుకోవడంతో పాటు కేపీహెచ్‌బీ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. ఇరువురిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మేఘా కృష్ణారెడ్డి మాతృమూర్తికి ఘన నివాళి

నివాళులు అర్పించిన సీఎం రేవంత్‌రెడ్డి, ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్

సాక్షి, సిటీ బ్యూరో: మేఘా సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ కృష్ణారెడ్డి మాతృమూర్తి పురిటిపాటి విజయలక్ష్మికి పలువురు నివాళులు అర్పించారు. బుధవారం హైటెక్స్‌లో జరిగిన సంస్మరణ కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి, ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్‌తో పాటు పలువురు ప్రముఖులు, కుటుంబ సభ్యులు, బంధువులు, మిత్రులు, వివిధ రంగాలకు చెందిన అధికార, అనధికార ప్రముఖులు మేఘా సంస్థ అధికారులు, సిబ్బంది పెద్ద ఎత్తున పాల్గొని ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించిసానుభూతి తెలిపారు. తొలుత వారి కుటుంబ సభ్యులు హైటెక్స్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై విజయలక్ష్మి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. నివాళులు అర్పించిన ప్రముఖుల్లో కేంద్ర మంత్రులు జి కిషన్ రెడ్డి, బండి సంజయ్, భూపతిరాజు శ్రీనివాసవర్మ,రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పాల్గొన్నారు.

సిమెంట్ లారీ ఢీ : యువకుడి దుర్మరణం

మోకిల పీఎస్ పరిధిలో ఘటన



ఘటనా స్థలంలో మణికంఠ బైక్, మృతదేహం

శంకర్‌పల్లి: ఓ సిమెంట్ లారీ బైక్‌ను ఢీ కొట్టిన సంఘటన బుధవారం రాత్రి మోకిల పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నర్సాపురానికి చెందిన మణికంఠ(29) బీటెక్ పూర్తి చేసి, ఉద్యోగరీత్యా ఏడాది క్రితం హైదరాబాద్‌కి వచ్చాడు. కొద్ది నెలల క్రితం మోకిల పీఎస్ పరిధిలోని మియాఖాన్ గడ్డకు వచ్చి, ఇక్కడే నివాసం ఉంటూ టిఫిన్ సెంటర్ ఏర్పాటు చేసుకుని, జీవనం సాగిస్తున్నాడు. బుధవారం సాయంత్రం టిఫిన్ సెంటర్‌లో పనులు ముగించుకొని ఇంటికి వెళ్తుండగా.. శంకర్‌పల్లి నుంచి హైదరాబాద్ వైపు అతివేగం, అజాగ్రత్తగా వెళ్తున్న సిమెంట్ లారీ ద్విచక్రవాహనాన్ని బలంగా ఢీ కొట్టింది. ఈ ఘటనలో మణికంఠ అక్కడికక్కడే మృతి చెందగా, లారీ డ్రైవర్‌ని స్థానికులు పట్టుకుని పోలీసులు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి తల్లిదండ్రులతో పాటు వివాహం అయిన ముగ్గురు అక్కలు ఉన్నారు.

కదులుతున్న రైలులో మహిళపై లైంగిక దాడి

- గుంటూరు సమీపంలో ఘటన
- సికింద్రాబాద్‌లో బాధితురాలి ఫిర్యాదు
- జీరో ఎఫ్ఐఆర్ నమోదు

సికింద్రాబాద్: గుంటూరు–పెదకూరపాడు రైల్వే స్టేషన్ల మధ్య నడుస్తున్న రైలులో ఒంటరిగా ఉన్న మహిళపై మంగళవారం రాత్రి లైంగికదాడి జరిగింది. రైలు సికింద్రాబాద్ చేరుకున్న అనంతరం బాధితురాలు సికింద్రాబాద్ జీఆర్‌పీ పోలీసులకు ఫిర్యాదు చేసింది. జీరో ఎఫ్ఐఆర్ కింద కేసు నమోదు చేసుకున్న పోలీసులు తదుపరి విచారణ నిమిత్తం నడికుడి రైల్వే పోలీసులకు బదిలీ చేశారు. సికింద్రాబాద్ జీఆర్‌పీ ఇన్‌స్పెక్టర్ బీ.సాయీశ్వర్‌గౌడ్ తెలిపిన మేరకు.. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంకు చెందిన ఒక వ్యక్తి, ఓ మహిళ సంత్రాగచి ఎక్స్‌ప్రెస్‌రైలులో చర్లపల్లి రైల్వేస్టేషన్‌కు బయలుదేరారు. ఆమెను మహిళను మహిళల కోచ్‌లో ఎక్కించిన వ్యక్తి తను వేరే బోగీలో కూర్చున్నాడు. గుంటూరులో రైలు ఆగిన సమయంలో మహిళల బోగీలో మహిళ ఒక్కతే ఉంది. ఇది గమనించిన ఓ వ్యక్తి (40) మహిళల బోగీలోకి ఎక్కాడు. అందులో ఉన్న మహిళ ఇది మహిళల బోగీ అని వారిస్తున్నా ఒప్పించి అందులోకి ప్రవేశించాడు. రైలు పెదకూరపాడు రైల్వేస్టేషన్‌కు చేరుకుంటున్న సమయంలో బోగి డోర్లు లాక్ చేసిన ఆ వ్యక్తి ఒంటరిగా ఉన్న మహిళపై కత్తితో బెదిరించి లైంగికదాడి చేశాడు. అనంతరం ఆమె వద్ద నున్న రూ.5600 నగదు, ఆమె సెల్‌ఫోన్ లాక్కొని పెదకూరపాడు రైల్వేస్టేషన్ వద్ద రైలు నుంచి దిగి పరారయ్యాడు. సికింద్రాబాద్ చేరుకున్న అనంతరం బాధితురాలు జీఆర్‌పీ పోలీసులకు ఫిర్యాదు చేసింది.